'యువ వికాసం' దరఖాస్తులకు రసీదు అందజేయాలి

ఈ నెల 14లోపు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

కేఎంసీలో దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ పరిశీలనలో కలెక్టర్

దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, ఏప్రిల్ 8: రాజీవ్ యువ వికాసం పథకం కోసం అందిన దరఖాస్తుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి దరఖాస్తుదారుడికి రసీదు అందజేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తు స్వీకరణ కోసం కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్లను, అక్కడ జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. పలువురు దరఖాస్తుదారులతో కలెక్టర్ ముచ్చటించారు. 'ఏ యూనిట్లను ఎంచుకున్నారు? దరఖాస్తు చేసుకున్న రంగంలో ఎంత మేరకు అనుభవం ఉంది?' వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 14 వరకు గడువు ఉందని అన్నారు. అయితే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు ఇబ్బందులున్న వారు మున్సిపల్ కార్యాలయాల్లోగానీ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లోగానీ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు. ఈ దరఖాస్తుల స్వీకరణ కోసం కేఎంసీలో ఐదు కౌంటర్లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

దోభీఘాట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 8: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ మంగళవారం సందర్శించారు. ఎన్టీఆర్‌నగర్‌లోని అర్బన్ పీహెచ్‌సీని పరిశీలించి నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. పట్టణంలోని వేంసూరు రోడ్డులో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మోడ్రన్ దోభీఘాట్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్‌వికాసం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా స్వామివివేకానంద ఎక్సలెన్స్ భవనం వద్ద మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అర్బన్‌పార్క్‌ను, సత్తుపల్లి మోడ్రన్ గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.నరసింహా, ఎంపీడీవో ఆర్.నాగేశ్వరరావు, ఫారెస్ట్ రేంజర్ స్నేహలత, అధికారులు పాల్గొన్నారు.

మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు శిక్షణ

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 8: జిల్లాలో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ)లకు విధి నిర్వాహణపై ఒక్క రోజు శిక్షణ మంగళవారం ఇచ్చారు. శిక్షణకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ కళావతిబాయి హాజరై మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మాతా శిశుసంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు, ఎయిడ్స్, లెప్రసీ సంక్రమణ, క్షయవ్యాధి నివారణ కార్యక్రమాల గూర్చి అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుడా ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విధంగా చూడాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అందుబాటులో ఉన్న 12రకాల ఆరోగ్య సేవల గురించి పీహెచ్‌సీ డాక్టర్ రామారావు వివరించారు. కార్యక్రమంలో డాక్టర చందు నాయక్, వైద్యాధికారులు సుబ్రమాణ్యం, డీపీవో దుర్గా పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెనుబల్లి, ఏప్రిల్ 8: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తగూడెం నుంచి కల్లూరు వెళ్లే రోడ్డులో ముత్తగూడెం గ్రామసమీపంలోని బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పైలెట్ రాధాకృష్ణ, టెక్నీషియన్ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతని వైద్యపరీక్షలు నిర్వహించి అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో ఖమ్మం తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుడిచేతిపై మునిప్రసాద్ అని పచ్చబొట్టు ఉంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వేంసూరు, ఏప్రిల్ 8: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. వేంసూరు మండలం వెంకటాపురం గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి గుర్తించిన స్థానికులు వేంసూరు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై వీరప్రసాద్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాల కోసం సమీప పీఎస్‌లకు సమాచారం అందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★ DAGGULA JANARDHANA (OLD NAME), R/o. H.No. 4-4-24, GAJULARAJAM BASTHI, KOTHAGUDEM, BHADRADRI KOTHAGUDEM DIST, TELANGANA - 507101. Change my name as DAGGULA JANARDHANAMMA (NEW NAME), W/o. DAGGULA KOMARAIAH.
KMM -

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1) BAJAJ RE CNG 4S FI BS VI, 2024 - TG04 T0557, 2) BAJAJ RE CNG 4S FI BS VI, 2024 - TG04 T1099, 3) BAJAJ RE CNG 4S FI BS VI, 2024 - TG28T1459, 4) BAJAJ RE CNG 4S FI BS VI, 2024 - T/R
Cell:9959401146
Polas Juice Point Lane, ZP Centre, Beside's Sidhardh Hospitals, Khammam.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

- ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలి
- తేమ శాతం రాగానే ధాన్యం కొనుగోలు చేయాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి: సూర్యతేజ రైస్‌మిల్లును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి, ఏప్రిల్ 8: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పీ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైస్‌మిల్లులకు తరలించాలని, అవసరమైన వాహనాలను సన్నద్ధం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వేసవికాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతం రాగానే కొనుగోలు చేయాలని, నాణ్యతా ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ సంచులు, ప్యాడీక్లీనర్, తేమయంత్రాలు, వెయింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని మందలపాడు గ్రామంలో సూర్యతేజ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. అనంతరం పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ప్రభుత్వ భూమి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరా అధికారి చందన్‌కుమార్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

వేంసూరు, ఏప్రిల్ 8: వేంసూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం సందర్శించారు. కొత్త రేషన్‌కార్డు ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిశీలించి కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టెంట్, వాటర్‌తో పాటు, అన్ని సదుపాయాలు సమకూర్చాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ బాబ్జిప్రసాద్ ఉన్నారు.

వెంకటరెడ్డికి నివాళి

వెంకటరెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ

కూసుమంచి, ఏప్రిల్ 8: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన సోలీపురం వెంకటరెడ్డి సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మంగళవారం వెంకటరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో కందాళ వెంట రూరల్, కూసుమంచి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, వేముల వీరయ్య, కార్యదర్శి ఆసీఫ్ పాషా, మల్లీడి వెంకన్న, బజ్జూరి వెంకటరెడ్డి, బాలకృష్ణ, సైదులు, నలబోలు చంద్రారెడ్డి, మల్లయ్య ఉన్నారు.

పెద్దమునగాల ప్రైమరీ స్కూల్‌లో ఫేర్‌వెల్ డే

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల, ఏప్రిల్ 8: మండల పరిధిలోని పెద్దమునగాల ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం ఫేర్‌వెల్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శాంతికుమారి, హెచ్ఎం విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పరికపల్లి అంజయ్య, కాశీమల కృష్ణ, బంటు అర్జున్, పరికిపల్లి నాగార్జున, బంటు హనుమంతరావు, లింగాల పుల్లారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

పెనుబల్లి, ఏప్రిల్ 8: మండలంలోని వీఎం. బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చౌడవరం గ్రామానికి చెందిన సడియం వంశీ సోమవారం పాఠశాల అనంతరం ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వంశీ ని హైదరాబాద్ హాస్పిటల్ చేర్పించి కుటుంబసభ్యులు చికిత్స అందిస్తున్నారు. పాఠశాల హెచ్ఎం, ఎంఈవో సత్యనారాయణ, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించాలని కోరారు. వారి అభ్యర్థన మేరకు వీఎం. బంజర పాఠశాల ఉపాధ్యాయులు రూ.65 వేలు, మిగిలిన పాఠశాలల హెచ్ఎంలు రూ.35 వేలు మొత్తం లక్ష రూపాయలు మంగళవారం హాస్పిటల్ యాజమాన్యానికి అందజేశారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

పెనుబల్లి, ఏప్రిల్ 8: మండలంలో మంగళవారం రాత్రి ఈదూరుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులతో వర్షం కురవడంతో తాళ్లపెంటలో రోడ్డుపై భారీవృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు చెట్టును నరకడంతో వాహనాల రాకపోకలు సాగాయి.

ఖమ్మంలో కల్తీ పాల విక్రయం!

దుకాణం ఎదుట వినియోగదారుల నిరసన

షాపులో ఆహార భద్రత అధికారుల తనిఖీ

షాపు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

రఘునాథపాలెం, ఏప్రిల్ 8: ఖమ్మంలోని కల్తీ పాల విక్రయ కేంద్రంపై ఫుడ్ సేఫ్టీ (ఆహార భద్రత) అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. నేలకొండపల్లి మండలానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఖమ్మంలోని టీడీపీ ఆఫీసు ఎదురుగా 'బొమ్మిశెట్టి నేలన్న సమగ్ర సేంద్రియ వ్యవసాయ వేదిక' పేరుతో పాల ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. అయితే ఈ షాపులో నిర్వాహకులు కల్తీ పాలు విక్రయిస్తున్నట్లు ఖమ్మానికి చెందిన కొల్లు రామారావు అనే వ్యక్తి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి వెళ్లి సదరు షాపులో తనిఖీలు చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి శాంపిళ్లను సేకరించారు. ఈలోపు మరికొందరు వినియోగదారులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ కేంద్రంలో సేంద్రియ ఉత్పత్తుల అమ్మకాలను చేపడుతూ కల్తీపాలను విక్రయిస్తున్నట్లు వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న వినియోగదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని సదరు షాపు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. షాపులో కొనుగోలు చేసిన పాలు చేతికి బంక బంకగా అంటుకుంటున్నాయని, పాలను వేడి చేస్తే గడ్డలు కట్టుతున్నాయని వినియోగదారుడు రామారావు ఆరోపించారు. సమస్యను షాపు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని వాపోయాడు. కాగా, తనిఖీ సమయంలో ఎలాంటి అనుమతుల్లేకుండా షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. 15 రోజుల్లో లైసెన్స్‌కు రాకుంటే కేసు నమోదు చేస్తామని తెలిపారు. సేకరించిన శాంపిళ్లను రిపోర్టుల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు చెప్పారు.

తక్కువ, అత్యధిక మార్కుల పేపర్లను.. పునఃపరిశీలించాలి

'టెన్త్ స్పాట్' సందర్శనలో అబ్జర్వర్ శ్రీనివాసాచారి

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 8: పదో తరగతి మూల్యాంకనం (స్పాట్)లో అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈలు) వాల్యుయేషన్ చేసే సమాధాన పత్రాలను చీఫ్ ఎగ్జామినర్లు (సీఈలు) పర్యవేక్షించాలని మోడల్ స్కూల్ డైరెక్టర్, జిల్లా టెన్త్ స్పాట్ అబ్జర్వర్ శ్రీనివాసాచారి సూచించారు. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్స్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని అబ్జర్వర్ శ్రీనివాసాచారి మంగళవారం సందర్శించారు. సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తున్న స్పాట్ ప్రక్రియను పరిశీలించారు. అత్యధిక, తక్కువ మార్కులు వచ్చిన పేపర్లను సీఈలు పునఃపరిశీలించాలని ఆదేశించారు. అనంతరం, క్యాంపులో రిపోర్టింగ్ చేసిన ఉపాధ్యాయుల వివరాలను తెలుసుకున్నారు. డీఈవో, క్యాంప్ ఆఫీసర్ సోమశేఖరశర్మతో స్పాట్ విషయాలపై చర్చించారు. సోషల్ వెల్ఫేర్ నుంచి వచ్చిన టీచర్లు, భద్రాద్రి జిల్లా నుంచి వచ్చిన టీచర్లు, స్పెషల్ అసిస్టెంట్లుగా బీఈడీ కళాశాల నుంచి వచ్చిన 100 మంది విద్యార్థులు మంగళవారం స్పాట్ వద్ద రిపోర్ట్ చేశారు. సోషల్ మినహా మిగిలిన సబ్జెక్టులకు ఏఈలు పూర్తిస్థాయిలో అడ్జెస్ట్ అయ్యారని, సోషల్ సబ్జెక్టుకు మాత్రం ఇంకా 16మంది అవసరమని గుర్తించారు.

జాయిన్ చేసుకోవద్దని డీఈవో ఆదేశాలు..

స్పాట్ విధుల కోసం కేటాయించిన ఉపాధ్యాయుల్లో రిపోర్ట్ చేయకుండా క్యాన్సిలేషన్‌కు దరఖాస్తు చేసిన వారివి ఒక్కటి కూడా క్యాంప్ ఆఫీసర్ ఆమోదించలేదు. స్కూల్లో రిలీవ్ అయి క్యాంప్‌లో రిపోర్ట్ చేయని ఉపాధ్యాయులకు డీఈవో ఝలక్ ఇచ్చారు. అయితే, పాఠశాలలో రిలీవ్ అయిన ఉపాధ్యాయులను మళ్లీ జాయిన్ చేసుకోవద్దని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చారు. మెడికల్ సర్టిఫికెట్ లేదా సెలవులో వెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది.

గిస్కానాయక్ నగర్‌లో 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 8: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గిస్కానాయక్ నగర్‌లో మంగళవారం 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గతంలో కాలనీవాసులు 100కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనపు లోడ్ పడుతుండడంతో కాలనీవాసులు ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. స్పందించిన అధికారులు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఆ స్థానంలో 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ నాగేశ్వరరావు, ఏడీ రామకృష్ణ, ఏఈ ప్రభాకర్, బీఆర్ఎస్ నేత బానోత్ కృష్ణ, కాలనీవాసులు బానోత్ బాలాజీ, బానోత్ జ్యోతి, సురేందర్‌రెడ్డి, వేణు, స్రవంతి, సాయి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి

కొణిజర్ల ఏప్రిల్ 8: ఈ నెల 27న వరంగల్‌లో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు మారుమూల ప్రాంతాల నుంచి భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పోట్ల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ పోట్ల కవిత పిలుపునిచ్చారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రజతోత్సవ వేడుకల భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై చేసిన దిశానిర్దేశం మేరకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆదేశానుసారం బహిరంగ సభకు ప్రజానికం తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశాలతో పాటు, గోడరాతలు, పోస్టర్లు, జెండాలు తదితర కార్యక్రమాల పట్ల గ్రామస్థాయి పార్టీని సన్నద్ధం చే యాలన్నారు. సభకు వెళ్లే కార్యకర్తల ఫోన్‌నెంబర్లు, జాబితాను సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత నివేదికను ఈ నెల 15లోపు నియోజకవర్గాల వారీగా అందించే కార్యచరణపై రాష్ట్ర పార్టీకి నివేదిక పంపనున్న నేపథ్యంలో గ్రామస్థాయి నాయకులంతా చురుకుగా పనిచేయాలన్నారు.

ఎర్రా శ్రీకాంత్‌కు 'కూనంనేని' నివాళి

ఎర్రా శ్రీకాంత్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం కమాన్‌బజార్, ఏప్రిల్ 8: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్ మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రకాశ్ నగర్‌లోని శ్రీకాంత్ భౌతికకాయాన్ని మంగళవారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు బాగం హేమంతరావు, వెంకటేశ్వరరావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

బోనకల్లు, ఏప్రిల్ 8: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆశాలత సూచించారు. మంగళవారం బోనకల్లు గ్రామపంచాయతీ పరిధిలోని వననర్సరీ, శ్మశానవాటికలు, డ్రైనేజీ వ్యవస్థ, పలుఅభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలో మొక్కలు వేసవిలో కాపాడేందుకు పరదాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా మండల అధికారులు పర్యవేక్షణ చేసి తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకట కోటేశ్వరరావు శాస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 8: గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ కమిటీలను మరింత బలోపేతం చేయాలని మండల స్పెషలాఫీసర్ బీ జ్యోతి అన్నారు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా బాల కార్మికులు, బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్ రూరల్ ఎస్సై అనీల్‌కుమార్, హెచ్ఎం సత్యావతి, ఎన్‌జీవో ప్రతినిధి వీ శివయ్య, ఎంపీవో శ్రీదేవి, ఐసీడీఎస్, ఐకేపీ, అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుపై యాజమాన్య పద్ధతులు పాటించాలి

మధిర(చింతకాని), ఏప్రిల్ 8: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి దర్శనాల పుల్లయ్య సూచించారు. మంగళవారం చింతకానిలోని రైతువేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. మట్టి నమూనా టెస్టులు చేయించుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా ఆయన రైతులకు వివరించారు. చింతకాని, నర్సింహాపురం, రాఘవాపురం, కొదుమూరు గ్రామాల్లో రైతులకు ఎన్ఎఫ్ఎస్ఎం ద్వారా పంపిణీ చేసిన ఎంటీయూ–1010 వరి పొలాలను పరిశీలన చేశారు. కార్యక్రమంలో మధిర డివిజన్ వ్యవసాయ ఉపసంచాలకులు స్వర్ణ విజయ్‌చంద్ర, మండల వ్యవసాయ అధికారి ఎస్.మానస, వ్యవసాయ విస్తరణ అధికారి అయోషఫాతిమా, రాము, తేజ, కార్తీక్, కల్యాణి పాల్గొన్నారు.

రైస్ మిల్లులను తనిఖీ చేసిన తహసీల్దార్

కూసుమంచి, ఏప్రిల్ 8: మండలంలోని కూసుమంచి శ్రీవెంకటేశ్వర రైస్‌మిల్, చౌటపల్లిలోని మిల్లును తహసీల్దార్ కరుణశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. గత సంవత్సరం కొనుగోళ్లు తోలకాలు, నిల్వలు, వంటి వాటితోపాటు యాసంగిలో ఎంత ధాన్యం కొనుగోలు చేస్తారు, అందులో ఎంత నిల్వ చేసుకోగలుగుతారు అనే అవశాలపై అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఉన్న స్టాక్ విషయంలో నష్టం జరుగుతుందని దానిని తమకు భారం కాకుండా చూడాలని మిల్లర్లు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి విజయ్ బాబు, ఆర్ఐలు రాము, జ్యోతి, సర్వేయర్ రవి పాల్గొన్నారు.

ఎంవీ ప్రసాద్‌కు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 8: సిద్ధారెడ్డి కళాశాల పూర్వ విద్యార్థి, జిల్లా కోర్టు సహకార సంఘ కార్యాలయ ఉద్యోగి ఎం.వెంకటేశ్వర ప్రసాద్ ఆకస్మిక మృతికి పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. అతడి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. అతడి కుమార్తె తబుశ్రీ ఇంజినీరింగ్ విద్యను కొనసాగించేందుకు రూ.1.42 లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. పూర్వ విద్యార్థులు వేణు, ముదిరెడ్డి నిరంజరెడ్డి, శ్రీధర్, స్వర్ణ సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీధర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకోదండ రామస్వామి ఆలయ సిల్వర్ జూబ్లీ బ్రహ్మోత్సవాలు

మధిర, ఏప్రిల్ 8: మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామంలో శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సిల్వర్ జూబ్లీ బ్రహ్మోత్సవాలు, శ్రీరాముని పట్టాభిషేకం మంగళవారం నిర్వహించారు. వేదపండితులు అనంతఆచార్యులు శిష్యులతో వేద మంత్రోచ్చలతో స్వామికి పూజలు చేశారు. సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను నిర్వహించిన కొఠారి రాఘవరావును ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు. అనంతరం అన్